


లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక సబ్ ట్రెజరీ పరిధిలో గల విశ్రాంత ప్రభుత్వ పింఛనుదారుల సమావేశం ఈనెల 10న ఉదయం 10 గంటలకు పట్టణంలోని బెలగాంలో గల రైతు బజార్ వెనుక ఉన్న రిటైర్డ్ పింఛనుదారుల సమావేశం మందిరంలో జరుగుందనిమన్యం జిల్లా రిటైర్డ్ పింఛనుదారుల అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికేట్ రిజిస్ట్రేషన్ చేయని పింఛనుదారులు తమ ఆధార్ కార్డు, ఫోన్ తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పింఛనుదారుల భవనానికి రాలేని పింఛనుదారుల ఇంటి వద్దకే వచ్చి లైఫ్ టైం రిజిస్ట్రేషన్ చేయబడినని, ఈ అవకాశాన్ని రిటైర్ ప్రభుత్వ పింఛనుదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మొన్న దిగువశెంబి... నిన్న దూళిభద్ర

- కొనసాగుతున్న ఒడిశా ఆగడాలు
- వాటర్ ట్యాంక్ నిర్మాణ సామగ్రి ఎత్తుకెళ్లిన కొటియా పోలీసులు
- చోద్యం చూస్తోన్న ఎపి అధికారులు



దూళిభద్రలో ఎపి అధికారులు నిర్మిస్తున్న జలజీవన్ ట్యాంకు

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశా అధికారులు, పోలీసుల ఆగడాలు మళ్లీ శృతిమించుతున్నాయి. గత కొద్దిరోజులుగా కొటియా పోలీసులు అధికారులు చేపడుతున్న కవ్వింపు చర్యలు ఎపి అధికారులు, పోలీసులకు తలనొప్పిగా మారాయి. గత కొంతకాలంగా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న వివాదాస్పద గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఎపి, ఒడిశా రాష్ట్రాల్లో 8 నెలల క్రితం కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాయి. ఎన్డీయే కూటమిలో ఉన్న టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు ఎపిలో అధికారంలో ఉండగా, ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వాల హయాంలో ఒడిశా పోలీసులు, అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో అనేక దుశ్చర్యలకు పాల్పడ్డాయి. ఎపి ప్రభుత్వం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడం, అభివృద్ధి పనులు జరగకుండా ఆటంకపర్చడం వంటి చర్యలకు ఒడిశా పోలీసులు అధికారులు తెగబడ్డారు. అయితే ఇప్పుడు మళ్లీ అలాంటి చర్యలకే ఒడిశా పోలీసులు, అధికారులు దిగుతున్నారు. వారం రోజుల క్రితం గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని దిగువ శెంబిలో గల అంగన్వాడీ కేంద్రం నుంచి కొటియా పోలీసులు, అధికారులు కొన్ని మ్యాపులను, పుస్తకాలను తీసుకెళ్లారు. ఈ సంఘటన మరువకముందే ఒడిశా పోలీసులు శనివారం గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని దూళిభద్రలో మరో దురాగతానికి పాల్పడ్డారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద నిర్మాణమవుతున్న వాటర్ ట్యాంక్ సామగ్రిని, సిమెంట్‌ను వ్యాన్‌తో సహా తీసుకెళ్లారు. ఎపి ప్రభుత్వం దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపడుతోంది. సాలూరుకు చెందిన కాంట్రాక్టర్ రామకృష్ణ ఈ పనులు చేస్తున్నారు. వ్యాన్‌లో సిమెంట్, ఇనుము ఇతర సామాగ్రిని దూళిభద్ర తీసుకెళ్లి అక్కడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో నిర్మాణ ప్రదేశానికి ఒడిశా పోలీసులు, అధికారులు చేరుకొని వ్యాన్‌తో సహా నిర్మాణ సామగ్రిని కొఠియా పోలీసు స్టేషన్‌కు తరలించారు. వ్యాన్‌ను డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇంత జరిగినప్పటికీ ఆంధ్రా అధికారులు, పోలీసులు గానీ ఈ వ్యవహారంపై నోరుమెదపడం లేదు. కొటియా గ్రామాల్లో రహదారులు, పాఠశాల భవనాల నిర్మాణం, జలజీవన్ మిషన్ వంటి పనులు ఒడిశా ప్రభుత్వం చేపట్టింది. ఈ పనులను ఎపి అధికారులు, పోలీసులు ఏనాడూ అడ్డుకోలేదు. అయితే ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను మాత్రం ఒడిశా పోలీసులు అధికారులు అడ్డుకుంటున్నారు. ఎపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని అలుసుగా తీసుకున్న ఒడిశా పోలీసులు, అధికారులు తరచూ దుశ్చర్యలకు పాల్పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల వ్యవధిలోనే కొటియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల ఆగడాలు శృతిమించుతున్న తీరు ఎపి అధికారులు, పోలీసులను కలవరానికి గురి చేస్తోంది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోతే తాము ముందుకు వెళ్లలేమనే నిస్సహాయతని ఎపి అధికారులు, పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.



కొఠియా పోలీసు స్టేషన్ వద్ద ఆంధ్రా వ్యాను

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

సహకరించాలని ఆర్‌టిసి డిపో మేనేజరుకు ఆదివాసీ గిరిజన సంఘం వినతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎపి గిరిజన సంఘం నాయకులు అవినాష్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనుల హక్కుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను గిరిజనులంతా ఐక్యంగా ప్రతిఘటించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కులను కాలరాసేలా స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఈనెల 11,12 తేదీల్లో జరిగే మన్యం బందును జయప్రదం చేయాలని కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా సమావేశం నిర్వహించారు. అనంతరం బంద్ రోజున బస్సులు నిలిపివేసి సహకరించాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌కు నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులు నివసిస్తున్నారని, వారికి రాజ్యాంగబద్ధంగా హక్కులు, చట్టాలు కల్పించబడ్డాయని తెలిపారు. కొన్ని రోజుల క్రితం గిరిజన ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టమే ఆటంకమని, వాటిని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంపై కార్పొరేట్ వ్యక్తులు డేగ కళ్లతో కాలు దువ్వాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో అయ్యన్నపాత్రుడు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం అమానుషమని మండిపడ్డారు. వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటన విడుదల చేయాలని, రాష్ట్ర తెలుగుదేశం, జనసేన, బిజెపి స్పష్టమైన వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టానికి రక్షణ కల్పించాలని, ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయులు నియామక చట్టం చేయాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకులు మండంగి రమణ, రామారావు, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఈనెల 11, 12వ తేదీల్లో తలపెట్టిన ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మధు ప్రసాదు, నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు కూనేరు సంతలో ఏజెన్సీ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ఆదివాసీ సంఘాల బంద్ సంపూర్ణంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి ఈనెల 12న కొమరాడలో పెద్ద ఎత్తున ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గిరిజనులు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



కూనేరు సంతలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజన యువకులు



గిరిజన యువతతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గిరిజనులతో ఒక రోజు

ఏజెన్సీలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - సాలూరురూరల్

సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అభివృద్ధి గల కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గిరిజనులతో ఒకరోజు గడిపి వారి జీవన విధానాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకోవాలని అనుకున్నారు. ఇందులో భాగంగా శనివారం సెలవు రోజు కావడంతో మండలంలోని కొదమ పంచాయతీ లొద్ద ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి గిరిజనులతో మమేకమై వారి జీవన శైలిని పరిశీలించి ముఖాముఖి మాట్లాడారు. వారి సాంప్రదాయక వస్త్రధారణ, వస్తు ధారణ గురించి తెలుసుకున్నారు. తీసుకునే ఆహార విధానాలను పరిశీలించారు. గిరిజనులు పండించే పంటలు, వాటిని వినియోగించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సంతల్లో ఎక్కువగా విక్రయించడం, తద్వారా వచ్చే ఆదాయం, కొద్దిపాటి పంట ద్వారా జీవనం గడుస్తుందని వారు వివరించారు. దీనికి మార్కెటింగ్ వంటి సదుపాయాలు కల్పించడం వల్ల మరింత విలువ ఆధారితతో అధికఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. అందుకు అవసరమగు ఏర్పాట్లకు చర్యలు చేపడతామని చెప్పారు. లొద్ద ప్రాంతంలో వాటర్ ఫాల్స్ (జలపాతం) ఎంతో రమణీయంగా ఉందని, ఎక్కువ మంది పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. పర్యాటక అవకాశాలు మరింత మెరుగుపర్చేందుకు చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కొంత దూరం ద్విచక్ర వాహనం పైన, కొంత దూరం ట్రెక్కింగ్, వాకింగ్ చేస్తూ వాటర్ ఫాల్స్ వద్దకు కలెక్టర్ చేరుకున్నారు. గిలొద్ద ప్రాంతంలో పర్యాటక సంస్కృతి, సాంప్రదాయక అవకాశాలు పెంపొందించేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తామని చెప్పారు. గిరిజనులు ఎంతో అమాయకంగా, వారి జీవన విధానం చూడముచ్చటగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఆదాయ మార్గాలు తక్కువగా ఉండడాన్ని గ్రహించామని, వాటిని పెంపొందించేందుకు గల అవకాశాలను వివిధ మార్గాల ద్వారా చేపడతామని ఆయన అన్నారు. పర్యాటకులు ఎక్కువ మంది లొద్ద జలపాతాన్ని పర్యటించడం ద్వారా చిన్నపాటి వ్యాపార కార్యకలాపాలు జరిగి ఆదాయ మార్గాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

సమాజ మార్పునకు చదువే మూలం

రచయిత గంటేడ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్
ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రజ్ఞా వికాస పరీక్ష


ప్రజాశక్తి పార్వతీపురం

అణుబాంబుల యుద్ధాలతో సమాజ మార్పు చెందదని, మార్పును కోరుకునేది చదువు ఒకటేనని, కావున సమాజంలో ప్రతి ఒక్కరూ కచ్చితంగా చదువుకోవాలని, అదే పదునైన ఆయుధమని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. శనివారం స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాసం పరీక్ష నిర్వహించారు. మొదటగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, గంటేడ గౌరునాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, సింహాచలం, కళాశాల సిబ్బంది ఈ పరీక్ష ప్రశ్నా పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ నేటి విద్యార్థులు పరీక్షలంటేనే భయాందోళనకు గురవుతూ, చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇటువంటి నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సింది నైపుణ్యత, శిక్షణలని అన్నారు. చదువుంటే సమాజాన్ని మార్చగలదని, ఆ చదువుని ప్రతి విద్యార్థి ప్రేమించి ఆస్వాదించాలని అన్నారు. అనంతరం మురళీమోహన్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఈ ప్రజ్ఞావికాస పరీక్ష దోహదపడుతుందని, ప్రపంచీకరణ విధానాలకు లోబడకుండా భవిష్యత్తు లక్ష్యసాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులకు విద్యను అందించేలా వారి ఆలోచన మెరుగుపడాలని సూచించారు. పరీక్షల్లో ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏక దృష్టితో మంచి ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని, నేడు మారుతున్న విద్యా కాషాయికరణ విధానాలతో విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు పాలక ప్రభుత్వాలు చేపడుతున్నాయని అన్నారు. అటువంటి భ్రమలకు లోబడకుండా, శాస్త్రీయ విద్యతో మెలగాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు డేవిడ్, సింహాచలం మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల, విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల నైపుణ్యతను పెంచి, భవిష్యత్తులో ఉన్నత చదువులను ప్రోత్సహించేలా వికాసం పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. స్వాతంత్ర ఉద్యమ నాయకుల జీవిత చరిత్రలను ఆదర్శంగా చేపట్టాలన్నారు. అందులో భాగంగా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ప్రజ్ఞా వికాసం పరీక్షల్లో 6,735 మంది విద్యార్థులు 74 పరీక్షా కేంద్రాల్లో పాల్గొన్నారని తెలిపారు. వీరిలో మొదటి స్థానంలో ప్రతిభ కనబర్చిన వారికి నగదుతో పాటు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, సంధ్య, రాజేష్, సాయి, భాస్కర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ప్రజ్ఞా వికాస పరీక్ష పత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

కురుపాం : ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కిషోర్ చంద్ర దేవి డిగ్రీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ కురుపాంలో నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 500 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ముందు ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్ష రాయడం వల్ల విద్యార్థులు పబ్లిక్ పరీక్ష రాసే ముందు ఎటువంటి భయాందోళన లేకుండా ప్రశాంతంగా రాస్తారని ఊహించిన దానికంటే అధికంగా విద్యార్థులు వచ్చి పరీక్ష రాయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతి అందజేస్తామన్నారు. అలాగే మండల స్థాయిలో విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ ఎస్ఎఫ్ఐ బాధ్యులు ఎం.శివ, మండల నాయకులు బి. విష్ణు, కె.నితిన్, కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జి.వంశీ తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో ప్రజ్ఞా వికాస పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను

ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి పార్వతీపురం

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలను, జీతాల చెల్లింపు ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వ తీసుకొన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో చైర్మన్ కాంతారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ అధ్యక్షతన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులకు నష్టం చేకూర్చేలా అనేక నిర్ణయాలు చేస్తుందని విమర్శించారు. ప్రస్తుతం ఆప్కాస్ పద్ధతిలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు జరుపుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని మార్చి రాష్ట్రంలో ప్రస్తుతం పని చేస్తున్న 2 లక్షల 50 వేల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగుల భవితవ్యాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి, వారి ద్వారా కొత్త నియామకాలు, జీతాలు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం చేసిందని తెలిపారు. ఇదే జరిగితే రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వెజ్, కంటెంజెంట్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు కూడా చెల్లించే పరిస్థితి ఉండదని, పిఎఫ్, ఇఎస్ఐ, కూడా అమలు చేయరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు రాజకీయ నిరుద్యోగ పునరావస కేంద్రాలుగా మారి ఉద్యోగులకు రాజకీయ వేధింపులు, తొలగింపులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.. ఈ విధానానికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగులు, కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెఎసి కో- చైర్మన్ బి.ఈశ్వరరావు, పోలినాయుడు, ఆనందరావు, అభిరామ్, గణపతి, విజయనగరం జిల్లా జెఎసి నాయకులు జి.అప్పలసూరి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు

విజయగౌరిని గెలిపించండి


ప్రజాశక్తి - వీరఘట్టం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ శనివారం యుటిఎఫ్ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రేగులపాడు, కత్తుల కవిటి, ఎం రాజపురం తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులను కలిసి మీ మొదటి ప్రాధాన్యత ఓటు కోరెడ్ల విజయ గౌరికి వేయాలని సూచించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనన్నారు. కావున పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని శాసన మండలికి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం పైడిరాజు, బి దుర్గాప్రసాద్, కె.గౌరి నాయుడుతదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పుండొక చోట..మందొక చోట



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'పుండు ఒక చోట ఉంటే, మందు మరో చోట వేసినట్టుగా ఉంది ధాన్యం కొనుగోలుపై జిల్లాలో అధికార యంత్రాంగం అనుసరిస్తున్న తీరు. ఇక ప్రజాప్రతినిధులకు ఎలాగూ పట్టింపులేదు. దీంతో, అన్నదాత అన్యాయానికి గురౌతున్నాడు'. ఇది కొద్దిరోజులుగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో వినిపిస్తున్న పబ్లిక్ టాక్. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో అధికారుల తీరుపై రైతాంగం ఒకింత అసహనం వ్యక్తమౌతోంది. అసలు విషయం పక్కకు నెట్టేసి, ఆకస్మిక తనిఖీల పేరిట హడావుడి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని కొందరు, తీసుకెళ్లిన ధాన్యానికి ట్రక్ షీట్లు జనరేట్ చేయడం లేదని మరికొందరు, విక్రయించిన ధాన్యానికి సంబంధించి ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఛార్జీలు తమకు చెల్లించలేదని ఇంకొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు గోనె సంచులకూ డబ్బులు ఇవ్వలేదంటున్నారు. దీనిపై రైతులను కలిసి, వాస్తవాలను తెలుసుకుని కొనుగోలుకు, రసీదులకు, హమాలీ, రవాణా ఛార్జీలు, గోనెసంచుల డబ్బులు చెల్లింపునకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు (జిల్లా జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లయ్ డిఎం) ధాన్యం మిల్లులను మాత్రమే తనిఖీ చేస్తున్నారు. అక్కడ ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించినట్టు ప్రకటనలు గుప్పిస్తున్నారు. అమ్మపుట్టినిల్లు మేనమామకు తెలియదా? అన్నట్టుగా మిల్లులకు అధికారులు వస్తే ఎలాంటి విషయాలు పరిశీలిస్తారో? వాటిని ఏమేరకు పరిగణనలోకి తీసుకుంటారో తెలియదా? అని జనం చర్చించుకుంటున్నారు. వచ్చిన ప్రతి గింజా మిల్లుకు తీసుకుంటున్నట్టు చెప్పడం, వాటికి లెక్కలు చూపించడం మిల్లర్లకు కొత్త కాదు. ఇక్కడ సమస్యేమంటే రైతులకు సంబంధించిన ధాన్యం జిల్లాలోని దాదాపు అన్ని మిల్లుల్లోనూ ఉన్నాయి. వాటికి ట్రక్ షీట్లు ఎప్పటికప్పుడు ఎందుకు ఇవ్వలేదు. ఇటువంటి సందర్భాల్లో ఎక్కడైనా, ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటున్నారా? అంటే అటువంటిదేమీ లేదనే సమాధానం వినిపిస్తోంది. ఈనేపథ్యంలో రైతుల వద్దకు వెళ్తే, ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలుకు ఎన్నాళ్లుగా కాలయాపన జరుగుతోందో? రైతులు గోనె సంచులకోసం పడుతున్న అవస్థలేమిటో, ఛార్జీలు చెల్లించక వారు నష్టపోతున్న పరిస్థితి ఎలా ఉందో అర్థమౌతుంది. ఇటువంటి ప్రయత్నమేదీ అధికారులు చేయలేదంటూ రైతులు అంటున్నారు. పైగా జిల్లాలో ఈ ఏడాది 2,43,400 ఎకరాల్లో వరి సాగైంది. తద్వారా 4,97,614 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో సుమారు 47వేల మెట్రిక్ టన్నుల మేర తిండికిపోగా రైతులు 4.50లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం విక్రయించేందుకు అవకాశం ముందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో నడిచే సివిల్ సప్లై విభాగం మాత్రం 3.20లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు మాత్రమే లక్ష్యంగా తీసుకుంది. ఇందులో 3,13 మెట్రిక్ టన్నుల (98శాతం) మేర కొనుగోలు చేసినట్టు గత నెలాఖరు నాటికే చిట్టాలు తయారు చేశారు. అదే గనుక నిజం అయితే, రైతుల వద్ద ప్రస్తుతం ధాన్యం ఎందుకు ఉండిపోతాయి. దీన్నిబట్టి మిల్లర్లు పిడిఎస్ బియ్యాన్ని లెక్క చూపిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీన్నిబట్టి అధికారులు క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకు మిల్లులను మాత్రమే ఎందుకు పరిశీలిస్తున్నారన్నదానిపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మనరావు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ పార్క్ సమీపంలో సైబర్ నేరాలపై యువతకు, ప్రజలకు ఎస్ఐ వై.అమ్మనరావు శనివారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో ప్రజలను ఏ విధంగా మోసగిస్తారో ప్రజలు ఎలా గుర్తించాలి అన్న అంశాలను వివరించారు. అనంతరం సంకల్పంలో భాగంగా యువత డ్రగ్స్ దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిస కాకూడదని చెప్పారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలన్నారు. మైనర్లకు వాహనం ఇవ్వరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

23కు సదస్సు వాయిదా

ప్రజాశక్తి - పాలకొండ

ఐద్వా ఆధ్వర్యాన మహిళలపై అత్యాచారాలు, హత్యలు అన్న అంశంపై ఈనెల 9న జరగనున్న సదస్సును అనివార్య కారణాల వల్ల ఈనెల 23కు వాయిదా వేస్తున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై మహిళలు గమనించాలని ఆమె తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట



మండలంలోని కర్రివలసకు చెందిన దాసరి శంకర్రావు (34) పురుగుల మందు తాగి శనివారం మృతి చెందాడు. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. కర్రివలసకు చెందిన దాసరి శంకర్రావుకు భార్య హైమావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శంకర్రావు మద్యానికి బానిసై తరచూ మద్యం సేవించేవాడు. గత వారం రోజులుగా అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చే వాడు. దీంతో భార్య హైమావతి ఇలా రోజూ పనీ పాటు లేకుండా మద్యం సేవిస్తే కుటుంబం, పిల్లలను ఎలా పోషించుకోగలమని భర్తను ప్రశ్నించింది. దీంతో శంకర్రావు మనస్థాపానికి గురై శుక్రవారం మధ్యాహ్నం తన పొలంలో ఉన్న పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల రైతులు గమనించి భార్య హైమావతికి తెలియజేయగా, సాలూరు సిహెచ్‌సికి ఆటోలో తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బెల్లాన ముసలయ్య తెలిపారు.



ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు

మొక్కల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అరుకును సందర్శించారు. అరకులో ఉన్న బొటానికల్ గార్డెన్, హార్టికల్చర్‌ను, ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. బొటానికల్ గార్డెన్‌లో ఉన్న అనేక మొక్కల గురించి బోటనీ లెక్చరర్ టి సత్యారావు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. మొక్కల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవరం ఉన్నారు.

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- రాష్ట్రపతికి అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్ల వ్యక్తిగత దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన రాష్ట్రపతికి అంగన్వాడీ కార్యకర్తలు వ్యక్తిగత దరఖాస్తులు పంపించారు. శనివారం కెఎల్‌పురంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ ఆ దరఖాస్తులను చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఐసిడిఎస్ ఏర్పాటు చేసి యాభై ఏళ్లు పూర్తయిందని, ఈ నేపథ్యంలో ఐసిడిఎస్‌ను క్రమబద్ధీ కరించాలని, దశాబ్దాలుగా సర్వీస్ అందిస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలుతో పాటు, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని విజ్ఞప్తి చేస్తూ వ్యక్తిగతదరఖాస్తులను పంపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, నాయకులు ఎం.కృష్ణమ్మ, పి.ప్రభ, వరలక్ష్మి, పి.జ్యోతి, సిహెచ్ రూప, ఎం. రమణమ్మ, శ్యామల, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించి సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ అధ్యక్షతన స్థానిక గురజాడ గ్రంథాలయం వద్ద నిరుద్యోగ అభ్యర్థులతో ఏర్పాటు సమావేశంలో రామన్న మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఆరు నెలలు దాటినా ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డిఎస్‌సి సంతకం చేసినా నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని అన్నారు. వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ వేసి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే రెండేళ్ల తర్వాత దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారని, వెంటనే ప్రైమరీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు నిరుద్యోగుల కోసం నిరంతరం పోరాడుతూ అహర్నిశలు కష్టపడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించి శాసనసభకు పంపించాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహిన్ షా బాబా ఖాదర్ వలీ 66వ సూఫీ సుగంధ మహోత్సవం శనివారం బాబామెట్ట దర్గా, దర్బార్ షరీఫ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్సవాలు మొదలయ్యాయి. అనంతరం ఖాదర్ బాబా దర్బార్ నుంచి ఆయన ప్రియ శిష్యులు హాజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదర్ బాబా సూఫీ ఆధ్యాత్మిక వారసులు చీమలపాడు దర్గా పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మోహియుద్దీన్ షా తాజ్ ఖాదరి, విజయనగరం సూఫీ దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో భక్తులు ఫకీర్ మేళా, డప్పు వాయిద్యాలతో ఖాదర్ బాబా దర్గాకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.

ఏజెన్సీ పసుపునకు అంతర్జాతీయ ఖ్యాతి

- మార్కెట్ ధర లేక విలవిల
- ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీ పసుపుకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. ఇది గిరిజనులకు కొంతమేర ఆర్థిక చేయూతనిస్తుంది. ఏజెన్సీలో పసుపు ప్రకృతి సిద్ధంగా తయారవుతుంది. అందుకే దీనికి అంతర్జాతీయ ఖ్యాతి పలుకుతుంది. పసుపు రంగు, రుచి, ఛాయా ఉంటుంది. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంగానే పండిస్తారు. అలాంటి పసుపుకు మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీ పసుపు కొనుగోలు చేయడానికి మైదాన ప్రాంత వ్యాపారులు ఎగబడుతారు. ఐటిడిఎ పరిధిలో 3,786మంది రైతులు 6,886 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. అయితే కొండపోడు భూములు ఏప్రిల్, మే నెలలో పసుపు దుంపలు నాటుతారు. రెండేళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుంది.

తయారు చేసే విధానం

దిగుబడి వచ్చిన పసుపు దుంపలను తవ్వి కడిగి సున్నగా కాడలు కట్ చేస్తారు. పెద్ద అండాలో ఉడకబెట్టి బాగా ఎండ బెట్టి ఆ తరువాత రోడ్డుపై రంగ దిస్తారు. అప్పుడు పెట్టి విక్రయిస్తారు. గతంలో ప్రోత్సాహం కింద ఐటిడిఎ నుంచి పసుపు విత్తనాలు పాలిష్ యంత్రాలు పెట్టుబడి ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పసుపు

మార్కెట్ ధర లేక

గిరిజనులు శ్రమించి తయారు చేసిన పసుపును ఎత్తైన కొండలపై నుంచి మోసుకొని సంతకు తెచ్చి కావిడి చొప్పున విక్రయిస్తారు. దీన్ని మైదాన ప్రాంత వ్యాపారులు, దళారులు కారుచౌకగా కావిడి పసుపు వెయ్యి రూపాయలోపే విక్రయిస్తున్నారు. ఒక కావిడి పసుపు సుమారు 25 కేజీల నుండి 30 వరకు ఉంటుంది. ఏదివిదిలా ఉంటూనే తూతూ మంత్రంగా కొనుగోలు చేస్తున్నారని, గిరిజన సహకార సంస్థ అయితే అస్సలు కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ మాదిరిగా ప్రభుత్వమే పసుపు కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించాలని కోరుతున్నారు.

సహజసిద్ధంగా తయారు చేస్తాం

పసుపును రసాయనిక ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సహజసిద్ధంగా మేమే తయారు చేస్తాం. అందువల్ల పసుపుకు మంచి వాసన, ఛాయా వస్తుంది.

ఎం.రైకన్న, దుంబంగివలస

జిసిసి కొనుగోలు చేయాలి

కష్టపడి పండించిన పసుపుకు మార్కెట్ ధర లేకపోవడంతో మాకు కష్టమే మిగులుతుంది. మాకు ఆర్థికంగా కొంత డబ్బులు వచ్చేది పసుపు వల్లే. అందుకే ఈ పసుపును ప్రభుత్వ సంస్థలైన జిసిసి కొనుగోలు చేయాలి.

మండంగి రియ్యన్న, గిరిజనుడు, దుంబంగివలస


వీధుల్లో పసుపును ఎండిబెట్టిన గిరిజనులు

ప్రతిపాదనను పంపించాం

పసుపు రైతులకు విత్తనాలు ఉడకబెట్టిన అండాలు, పెద్ద పెద్ద ట్రబ్బులు, సోలార్ డ్రైవర్స్ పాలిష్ యంత్రాలు కోసం ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే ఇతర పనిముట్లు అందించేందుకు నివేదిక తయారు చేసి ప్రతిపాదనలో ఇప్పటికే పంపించాం.

ఎస్.వెంకట గణేష్ ,ఐటిడిఎ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి, సీతంపేట

బోర్డులు పెట్టేశారు.. పీకి పారేశారు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు స్థలాలను దర్జాగా దోచుకుంటున్నారు. లక్షలాది రూపాయల విలువైన స్థలాలను అమ్ముకుంటున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో రిజిస్ట్రేషన్లు కూడా చేసి లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. నగర పంచాయతీలో గ్రామ కంఠం పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పట్టణంలోని సిరి పోతున్న వీధి దగ్గరలో 479 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వం స్థలం క్రియ విక్రయాలు జరిగిపోతున్నాయి. దీనిపై అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ స్థలంలో ఇది నగర పంచాయతీ స్థలంగా బోర్డులు పెట్టినప్పటికీ ఒక పూటలోనే బోర్డులను తొలగించి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్నసిబ్బంది

ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవు : కమిషనర్

నగర పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని కమిషనర్ సర్వేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైన స్థలం దగ్గర నగర పంచాయతీ బోర్డులు పాడుతున్న నగర పంచాయతీ సిబ్బంది ఎవరైనా ప్రభుత్వ స్థలాలు అక్రమాలు జరిగితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - మక్కువ

ద్విచక్ర వాహనం నడిపే వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ అన్నారు. శనివారం చర్చి సెంటర్ వద్ద వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వారిపైన చట్ట ప్రకారం అపరాధ రుసుం విధిస్తూ చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని వాహన చోదకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరం: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

సీతానగరం: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద శనివారం రహదారి నియమనిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వాహన దారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోధకులు విధిగా లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు హెల్మెట్‌ను ధరించాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న మాతృభాష ఉపాధ్యాయులను సిఆర్‌టిలుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ మాతభాష ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సవర ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే అకాడమిక్ ఇయర్ స్కూల్ ప్రారంభానికి మాతృభాష ఉపాధ్యాయులు రెన్యువల్ చేయాలని కోరారు. గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే మాతృభాష ఉపాధ్యాయులను సిఆర్‌టిలుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జన్ని బుడ్డడు, మండల ప్రధాన కార్యదర్శి సవర మాసయ్య, మండల కోశాధికారి సవర ఎల్లాంగు, రాష్ట్ర గౌరవ సమన్వయకర్త సవర డుంబు, కమిటీ సభ్యులు, బిడ్డక రాంబాబు, బిడ్డక సుహాసిని, సుజాత, సురేష్, రామరాజు, సుధాకర్, క్రాంతి లక్ష్మి,క్రాంతి తదితరులు పాల్గొన్నారు,.


మాట్లాడుతున్న సవర ఆనందరావు

కళ్యాణం కమనీయం

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం శనివారం రాత్రి కన్నుల విందుగా జరిగింది. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున యాత్రికులు వచ్చారు. ఏటా మాఘశుద్ధ ఏకాదశి పర్వదినం రోజున ఆలయ ప్రాంగణంలో వార్షికకళ్యాణ మహోత్సవాన్ని దేవస్థానం అధికారులు నిర్వహిస్తున్నారు. ఉదయం సుప్రభాత సేవ ఆరాధన, మంగళ శాసనములు, విశేష హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు ఎదురు సన్నాహోత్సవాలతో పాటు స్వామివారి తిరువీధి మహోత్సవం జరిగింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది స్వామివారి వార్షిక సామూహిక ఉచిత కల్యాణ మహోతసవం తోటపల్లి దేవస్థానం అధికారులు, తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ సమన్వయంతో నిర్వహించారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుల సహకారంతో వైదిక మంత్ర అనుష్టానములతో బ్రహ్మశ్రీ జంధ్యాల జగన్నాధ శాస్త్రి పర్యవేక్షణలో తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వివి అప్పలాచార్యులు తదితరుల సహకారంతో సామూహిక ఉచిత సామూహిక కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించామని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. కళ్యాణం సందర్భంగా పద్మావతి అమ్మవారికి మంగళ సూత్రాలను రాజాంకు చెందిన కాల్దారి వెంకట శివప్రసాద రావు సమర్పించారు. కళ్యాణం సందర్భంగా దీక్ష వస్త్రాలను పార్వతీపురానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాస రావు, జ్యోతి, దంపతులు అందజేశా రన్నారు. కళ్యాణం సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్తు దీపాల అలంకరణతో సర్వాంగ సుంద రంగా తీర్చిదిద్దారు. కళ్యాణానికి వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా ఇఒ సూర్యనారాయణ, తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనంజయరావు, ప్రధానకార్యదర్శి డాక్టర్ డొల్లు పారినాయుడు, సభ్యులు గెంబలి శ్రీరామచంద్రమూర్తి, కిమిడి శ్రీరామ్మూర్తి, గుంట్రెడ్డి చంద్రశేఖరరావు, తదితరులు తగు చర్యలు చేపట్టారు.


తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు

ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్‌నాయుడు, మరిశర్ల బల రామునాయుడు, పెడారపు పోలిరాజు, చినమేరింగి సిఐ, స్థానిక ఎస్ఐ రమేష్ నాయుడు, నీలకంఠపురం, కురుపాం, జియమ్మవలస ఎస్ఐలు తమ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు.

డీ-వార్మింగ్ డేకు అంతా సిద్ధం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని (డీ వార్మింగ్ డే) పక్కగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. వైద్యాధికారులు, హెల్త్ సూపర్వైజర్లకు శనివారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమంలో 1 నుంచి 19ఏళ్ల వరకు పిల్లలు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, ముందస్తుగా సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తర్వాత ఈ మాత్రలు వేయించాలని అన్నారు. మాత్ర బాగా నమిలి మింగేలా జాగ్రత్త పడాలన్నారు. కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీరు సిద్ధం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు వయస్సు బట్టి నిర్దేశించించిన మోతాదు ప్రకారం వేయాలని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించా లన్నారు. పత్రికా, మీడియా ద్వారా కార్యక్రమాన్ని మరింత విస్తతంగా తెలియజేయాలన్నారు. డాక్టర్ భాస్కరరావు మాట్లా డుతూ జిల్లా వ్యాప్తంగా 1,96,612 మంది పిల్లలు, విద్యార్థులకు 3,845 కేంద్రాల్లో డీవార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించి ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్నామని, ఇందులో ఏడాది నుంచి ఐదేళ్ల లోపు 55,234 పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లోనూ, 5 నుండి 19ఏళ్లలోపు వరకు 1,41,378 విద్యార్థులకు పాఠశాల, కళాశాలల్లో మాత్రలు వేస్తారన్నారు. నులిపురుగులు సంక్రమణ వల్ల రక్తహీనత, పోషకార లోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, నీరసం వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని వాటి నివారణకు పిల్లలు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాల న్నారు. ఏవైనా కారణాలచే ఆరోజు ఆల్బెండజోల్ మాత్ర వేయాలని, పిల్లలకు ఈనెల 17న మాప్‌అప్ కార్యక్రమంలో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని, సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డిఐఒ డాక్టర్ నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు డాక్టర్ కె.విజయపార్వతి, డాక్టర్ కెవిఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్ రఘుకుమార్, డాక్టర్ ఎం.వినోద్, డాక్టర్ శ్రీధర్, డిఎస్ఒ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మన్యం బంద్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


1/70 భూ బదలాయింపు నిషేధ చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అవగాహన రాహిత్యం వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 12న చేపట్ట బోయే మన్యం బంద్ విజయవంతం చేయాలని గిరిజన సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకర్రావు కోరారు. శనివారం గుమ్మ లక్ష్మీపురంలో కరపత్రాలను విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను హరించే విధంగా స్పీకర్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు కంపెనీల పేరుతో ఏజెన్సీ ప్రాంతాన్ని ధారాదత్తం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇందులో భాగంగానే 1/70 చట్టాన్ని నిషేధించేందుకు ప్రయత్నిస్తే ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గిరిజనులకు వెన్నెముకగా ఉన్న జిఒ నెంబర్ 3 పునరుద్ధరించాలని, షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న లోకల్ కేడర్ పోస్టులు ఆదివాసీలకే కేటాయించాలని ఇందుకోసం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. శత శాతం పోస్టులు గిరిజనులకే కేటాయిస్తూ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని అన్నారు. 12న చేపట్టబోయే మన్యం బంద్‌కు వర్తక వాణిజ్య వ్యాపార సంస్థల యజమానులు, ప్రైవేటు వాహనాల యజమానులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బ లోవరాజు, జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ, ఆదివాసి జెఎసి నాయకులు పత్తిక లక్ష్మయ్య, బిడ్డిక రామ్మూర్తి, నిమ్మక రాజశేఖర్, పువ్వల ప్రసాద్, నిమ్మక ప్రశాంత్, కోలక కొండలరావు, నిమ్మక మోహన్ రావు, నాగభూషణం పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బెల్లిడిలో క్రికెట్ ప్రాక్టీస్ నెట్ ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ బెల్లిడి గ్రామంలో సుమారు రూ.85వేలు విరాళంతో ఆదివాసీ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయటానికి క్రికెట్ ప్రాక్టీస్ మ్యాట్ నెట్ ను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రేగిడి పోస్టుమాస్టర్, ఎజెఎసి జిల్లా సెక్రటరీ వి.తిరుపతి రావు రూ.5వేలు చెక్ విరాళంగా ఇస్తూ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనేక మంది ప్రతిభావంతులైన క్రీడాకారులుంటారని వారిని గుర్తించడానికి ఈ నెట్ ఉపయోగ పడుతుందని అన్నారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా యువత రాణించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, అలాంటి ఆదివాసీ యువతి యువకులకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రోత్సహిస్తూ వీరికి అవసరమైన కిట్స్ ఇవ్వాలని కోరారు. బెల్లిడి గ్రామానికి చెందిన క్రీడాకారులు ఉత్తమంగా నిలుస్తూ అనేక టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. క్రీడాలు, విద్య ఆదివాసీ యువకులకు ఎంతో దోహదపడతాయన్నారు. ఆదివాసీ భవిష్యత్ కోసం బాసటగా ఉన్న హక్కులు, చట్టాలు జీవో నెంబర్ 1/70, పిసా చట్టం, వీటిపైన అవగాహనా చేసుకోవాలని ఇప్పటికే జీవో నెంబర్ 3 తొలగించటం వల్ల ఆదివాసుల అభివృద్ధికి మరో 100 ఏళ్ళు పడుతుందని గుర్తుచేశారు. అనంతరం హిమరక సూరయ్య రూ.5వేలు, పత్తిక బంగారరాజు రూ.5వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో బెల్లిడి క్రికెట్ వారియర్స్ కెప్టెన్ కపిల్ దేవ్, వెంకటేష్, అర్జున్, రమేష్, గవరయ్య ధర్మారావు, సురేష్ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న తిరుపతిరావు

అనారోగ్య సంకేతాలను సకాలంలో గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అనారోగ్య సంకేతాలను సకాలంలో గుర్తించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో టీకా కార్యక్రమం, 18వ వార్డులోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నిర్వహించిన వైద్యశిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించారు. టీకా అర్హుల జాబితా పరిశీలించి షెడ్యూలు ప్రకారం పిల్లలకు టీకాలు వేస్తున్నారా అని తేదీలను గమనించారు. టీకా కార్డు తనిఖీ చేసి గడువు తేదీలను తల్లిదండ్రులకు ముందుగా తెలియజేయాలన్నారు. టీకా వయల్స్‌పై వినియోగించిన తేదీ నమోదు తప్పనిసరి అని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పిల్లల హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీసి ఏవైనా అనారోగ్య సమస్యలు గుర్తించారా అని అడిగి తెలుసుకున్నారు. శిశుఆరోగ్య విషయమై తల్లిదండ్రులతో మాట్లాడి తగుజాగ్రత్తలు సూచిస్తూ వేరే ఊరు వెళ్లాల్సి వచ్చినప్పుడు టీకా కార్డు వెంట తీసుకువెళ్లాలన్నారు. వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్యాధికారి నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు డాక్టర్ జగన్మోహన్ పరిశీలించారు. విద్యార్థులు ఏ చిన్న అనారోగ్య సమస్య తెలియజేసినా సత్వరమే స్పందించి వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. ప్రాథమికంగా అవసరమైన మందులు వసతి గృహంలో సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీసి రక్తహీనత, బరువు తక్కువగా గుర్తిస్తే అందుకు కారణాలపై దృష్టి సారించింది నివారణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి పలు ఆరోగ్య సూచనలు తెలిపి అవగాహన కల్పించారు. చర్మ వ్యాధులు తలెత్తకుండా జాగ్రత్తలు సూచించారు. కిశోర బాలికలకు ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్ర తప్పనిసరిగా వేయించాలన్నారు, పోషకాహారం సరిగా తీసుకోవాలన్నారు. పిల్లలు, విద్యార్థుల్లో అనారోగ్య సంకేతాలు సకాలంలో గుర్తించి వ్యాధి తీవ్రత కాకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బెలగాం చర్చివీధి యూపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.రవిచంద్ర, సూపర్వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది సావిత్రి, రామలక్ష్మి, హాస్టల్ వార్డెన్ కురమమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న జగన్‌మోహనరావు